మన సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక




మన సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక
ఎల్లవేళల జర్నలిస్టులకు అండగా నిలుస్తుంది,
నిజాన్ని నిగ్గదీసి అడుగుతుంది,
నిజాలను వార్తలుగా రాసే వారికి అవకాశం
సీఈఓ శెట్టి వెంకటేష్ గౌడ్ 9052045435

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శుక్రవారం 27 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 298 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## మార్కాపురం రోడ్డు ప్రమాదం: 13 మంది సజీవ దహనం.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనమై ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లాకు వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్ బస్సు టిప్పర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించడంతో పాటు పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురిని అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న సమాచారం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన సీఎం, బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.




## రామనవమి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 27, ప్రతినిధి: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రజలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సందేశంలో ఆయన మాట్లాడుతూ త్యాగం, తపస్సు, నియమం, కర్తవ్యనిష్ఠలకు ప్రతీక అయిన మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముని జీవితం ప్రతి మనిషికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి క్లిష్ట పరిస్థితిని ధైర్యం, సహనం, నీతి మార్గంతో ఎదుర్కొనే శక్తిని శ్రీరాముని బోధనలు మనకు అందిస్తాయని తెలిపారు. శ్రీరాముని ఆదర్శాలు యుగయుగాల పాటు భారతీయ సమాజానికి మాత్రమే కాకుండా సమస్త మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. దేశ ప్రజలందరికీ ఆయుష్షు, ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ భగవాన్ శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. అలాగే అభివృద్ధి చెందిన, స్వావలంబన భారత నిర్మాణం దిశగా ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.



విద్య, వైద్య రంగాలపై శాసనసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

## విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వాల తప్పులను సరిదిద్దుకుంటూనే నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా గత 27 నెలల్లో సుమారు 4,500 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ఇందులో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 2,046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 2,400 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. గత ప్రభుత్వంనుంచి వచ్చిన సుమారు 600 కోట్ల బకాయిల భారం మోస్తూనే ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులకు, ప్రైవేట్ ఆసుపత్రులకు కలిపి వేల కోట్ల నిధులు చెల్లిస్తూ పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించనున్నట్టు తెలిపారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిమ్స్, టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు కొత్తగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టి మొత్తం 10 వేల పడకల సామర్థ్యంతో ఆధునిక వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పేదలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆసుపత్రుల నిర్వహణ విధానంలో మార్పులు చేస్తూ ప్రత్యేక అధికారులను నియమించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విదేశాల్లో సేవలందిస్తున్న వైద్యులు కూడా రాష్ట్రానికి వచ్చి పేదలకు ఉచిత సేవలు అందించేలా ప్రత్యేక వేదికను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సమాజ అవసరాలకు అనుగుణంగా వైద్య రంగంలో కొత్త మార్పులను స్వీకరిస్తూ రాష్ట్రాన్ని విద్య, వైద్య రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## తెలంగాణలో TRP బలోపేతం – మెదక్, వనపర్తి జిల్లాల్లో భారీ చేరికలు

సందేశం టైమ్స్, మెదక్, మార్చి 27, ప్రతినిధి: విప్లవ వీరుడు, తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన నాయకుడు కోనాపూరి రాములు (సాంబశివుడు) గారి వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున వినమ్ర నివాళులు అర్పిస్తూ, ఆయన పోరాట స్ఫూర్తి Telangana రాజ్యాధికార పార్టీ కార్యకర్తలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.ఇందులో భాగంగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా TRP బలోపేతం కోసం చేరికలు కొనసాగుతున్నాయి. నేడు మెదక్, వనపర్తి జిల్లాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. రాష్ట్ర కార్యదర్శి నగేష్ ముదిరాజ్, మెదక్ జిల్లా అధ్యక్షులు యాదగిరి గౌడ్ మరియు వనపర్తి జిల్లా అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. TRP అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు కొత్తగా చేరిన వారందరినీ కండువా కప్పి, ప్రజా సంక్షేమం, బీసీ జనతకు రాజ్యాధికార సాధన కోసం ఆహ్వానించారు.తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, “మగ్గం చప్పుడు ఆగిపోతే తెలంగాణ గుండె ఆగిపోయినట్లే! ప్రజల సమస్యల పరిష్కారం కోసం TRP పక్కన ఉంటుంది. పదవి కోసం కాదు, నేతన్న కోసం నిలబడే నాయకులు కావాలి. బీసీ సమాజం కోసం నిజమైన పోరాటమే మన లక్ష్యం” అని అన్నారు.పార్టీలో వివిధ జిల్లాల నుండి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. మెదక్ జిల్లా నుంచి రాబోయే రోజులలో కూడా పెద్ద ఎత్తున చేరికలు జరిగే అవకాశం ఉన్నందున, TRP రాష్ట్రంలో తిరుగులేని బలమైన రాజకీయ శక్తిగా ఎదగనున్న సంకేతాలను ఇవి చూపిస్తున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో విస్తరించాలి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: ప్రజా సమస్యల సమగ్ర పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి విస్తరించడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాల్లో ముఖ్యమంత్రి గారితో ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయి, ప్రజా సమస్యలు పరిష్కరించే విధానాలను, ప్రభుత్వ కార్యక్రమాలను చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణలో రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లే అంశాలను చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే, రాజస్థాన్ “జన్ సూచన పోర్టల్” తరహాలో తెలంగాణలోనూ ‘ప్రజా సూచన పోర్టల్’ ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, అన్ని శాఖల పథకాల వివరాలు ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఐటీ శాఖ ద్వారా పోర్టల్ అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిఖిల్ డే గారు తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను ప్రశంసిస్తూ, చట్టం దేశంలో చారిత్రాత్మకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు చర్యలు – ముఖ్యమంత్రి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, సమగ్ర పోషకాహారం అందించడానికి అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గారు రాష్ట్ర శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి గారితో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 0–10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాస సామర్థ్య లోపాలను కార్తీక్ మురళీధరన్ గారు వివరించారు. చిన్న వయసులో పోషకాహార లోపం వల్ల భవిష్యత్తులో తలెత్తే ఆరోగ్య సమస్యలు, సరైన బోధన లేకపోతే విద్యార్థుల మానసిక, విద్యాభ్యాస సమస్యలు వచ్చే అవకాశం ఉన్నాయని సూచించారు.ముఖ్యమంత్రి గారు ఈ అంశాలపై ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందించడానికి బడ్జెట్ కేటాయింపులు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలతో పాటు "పోషణ సఖి"గా మరొకరిని నియమించి చిన్నారులకు పోషకాహారం అందించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.కార్తీక్ మురళీధరన్ గారి సూచనలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని, సమన్వయం చేసి ప్రత్యేక నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు.




## పెండింగ్ సాదాబైనమా, భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 27, ప్రతినిధి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనమా, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచే అఫిడవిట్ తీసుకునేలా జీఓ 76 జారీ చేసినట్లు తెలిపారు. సాదాబైనమా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డులో నమోదు కలిగి ఉండాలని, పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. భూమిపై పొజిషన్ ఉండడంతో పాటు 5 ఎకరాల లోపు భూములు కలిగిన వారికే పరిష్కారం కల్పించాలని చెప్పారు. నోటీసు జారీ చేసి 30 రోజులు పూర్తైన దరఖాస్తులను పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచనామా చేయాలని ఆదేశించారు. చలాన్ చెల్లించే ముందు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను సరిచూసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి 13 (బి) పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని, కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు సమయానికి జవాబు ఇవ్వాలని ఆదేశించారు. స్లాట్స్ బుకింగ్ రద్దు చేసుకున్న వారికి రీపేమెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీలను త్వరగా పూర్తి చేయాలని, ఫారం-6, 7, 8 పెండింగ్ లేకుండా చూడాలని, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


## నేషనల్ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం సాధ్యం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 27, ప్రతినిధి: నేషనల్ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని ప్రధాన జిల్లా & సెషన్స్ జడ్జి-కమ్-జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి పి. లక్ష్మి శారద తెలిపారు. ఈ నెల 28న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా మాట్లాడుతూ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకుంటే ఇరుపక్షాలకు విజయం లభించినట్లే అవుతుందని, పరస్పర స్నేహపూర్వక సంబంధాలు బలపడతాయని పేర్కొన్నారు. కుటుంబ విభేదాలతో వేరుగా జీవిస్తున్న దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎన్ఐ యాక్ట్ కేసులు, కంపౌండబుల్ క్రిమినల్ కేసులు, కుటుంబ వ్యవహారాలు, ఎంఏసీటీ కేసులు, పెండింగ్ సివిల్ సూట్లు, బ్యాంకు సివిల్ కేసులు వంటి వివిధ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి ప్రాంతాల్లో కూడా నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అక్రమ పట్టా మార్పిడి పై క్రిమినల్ చర్యలు

సందేశం టైమ్స్, అనంతగిరి, మార్చి 27, ప్రతినిధి: అనంతగిరి మండలం వాయిల సింగవరం రెవెన్యూ గ్రామ శివారులో సర్వే నెం. 8/3/1లో ఉన్న 2.4-34 గుంటల భూమికి సంబంధించిన అక్రమ పట్టా నమోదు, మార్పిడి వ్యవహారం వెలుగులోకి రావడంతో సంబంధితులపై క్రిమినల్ చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. 2013-14 సంవత్సరంలో కీ.శే. శ్రీమతి బుర్ర మట్టమ్మ (భర్త: చిన్న లింగయ్య) పేరున పాత పట్టేదారు పాసు పుస్తకం, అనంతరం 2018లో కొత్త పాసు పుస్తకాలు అక్రమంగా పొందినట్లు విచారణలో తేలింది. ఆ తరువాత వారసులైన బుర్ర సైదులు, బుర్ర లింగరాజు, బుర్ర వెంకటేశ్వర్లు పేర్లపై 10-07-2025న పట్టా మార్పిడి జరిపినట్లు గుర్తించారు. విచారణలో అప్పటి గ్రామ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వాస్తవ విస్తీర్ణం కంటే ఎక్కువ భూమిని నమోదు చేయించుకున్నట్లు, అలాగే ప్రభుత్వాన్ని మోసం చేసి రైతు బంధు, రైతు భరోసా పథకాల లబ్ధులు పొందినట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో పట్టా మార్పిడి పొందిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

## స్విమ్మింగ్ పూల్ వద్ద స్టాల్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం ఆధ్వర్యంలో రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్ద మూడు నెలల పాటు కెఫెటీరియా మరియు స్పోర్ట్స్ మెటీరియల్ విక్రయానికి స్టాల్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడా అధికారి అఖిలేశ్ రెడ్డి తెలిపారు. స్విమ్మింగ్ పూల్‌లోని రూమ్ ఏరియా అద్దెను నెలకు రూ.25,000గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31లోపు జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం, సంగారెడ్డి వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన పక్షంలో వేలం ద్వారా కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981798957ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపికలు 31న




సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 27, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, ఆదిలాబాద్ మరియు కరీంనగర్‌లో నాల్గవ తరగతి ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 31న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 8 గంటలకు జరిగే ఈ ఎంపికల్లో 9 రకాల మోటార్ క్వాలిటీ పరీక్షలు నిర్వహించనున్నారు. వాటిలో ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 6x10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ ఉన్నాయి. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపనున్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు 8 నుంచి 9 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి (01-09-2017 నుండి 31-08-2018 మధ్య జననం). విద్యార్థులు స్టడీ సర్టిఫికేట్, జనన ధృవీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం తీసుకుని హాజరుకావాలని సూచించారు.

## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు 30న

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్స్ హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ మరియు హన్మకొండలో నాల్గవ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపికల్లో ఉత్తీర్ణులైన బాలబాలికలకు జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం, సంగారెడ్డిలో ఉదయం 9 గంటలకు ఈ ఎంపికలు జరగనున్నాయి. 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించి 31-08-2026 నాటికి 8 సంవత్సరాలు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు ఒరిజినల్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి బోనఫైడ్ సర్టిఫికేట్, జనన ధృవపత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికేట్, 5 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆన్లైన్ రిజిస్ట్రేషన్ మార్క్ షీట్ తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, సంగారెడ్డి ఫోన్ నెంబర్ 7981798957ను సంప్రదించవచ్చని తెలిపారు




## పశువైద్య సేవల బలోపేతానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 27, ప్రతినిధి: జిల్లాలో పశువైద్య సేవలను బలోపేతం చేయడానికి ఎంత ఖర్చయినా వెనుకాడబోమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పశువైద్యాధికారుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో లాభాల పాడి వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చికిత్స కంటే నివారణ మేలన్న సామెతను అనుసరించి పశువైద్యం ప్రజా వైద్యంకంటే మరింత ప్రాముఖ్యమని, జిల్లాలో పశువైద్య సేవలు అభినందనీయంగా ఉన్నాయని అధికారులను ప్రశంసించారు. పశు ఆరోగ్యం, జాతి అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ, లింగవిభజన వీర్యం వినియోగం, వ్యాధుల నివారణకు టీకాలు వంటి కార్యక్రమాలతో పాటు అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్లు, విరిగిన కాళ్లకు రాడ్లు వేయడం, ఆర్థోపెడిక్ సర్జరీలు నిర్వహించడం వంటి సేవలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్, శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం, ఆపరేషన్ పరికరాల కిట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణాల్లో వ్యాధిగ్రస్త పశువులను తరలించేందుకు హైడ్రాలిక్ అంబులెన్సులు, ప్రతి నియోజకవర్గానికి ఆర్థోపెడిక్ సర్జరీ కిట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పశుగ్రాస కొరతను తీర్చేందుకు విత్తనాలు అందించి పశుగ్రాస బ్యాంక్ ఏర్పాటు చేస్తామని, కోదాడలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పశు ఔషధ బ్యాంక్ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 55 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేయాలని సూచించారు. కోదాడ, చిలుకూరు ఆసుపత్రులకు అల్ట్రాసౌండ్ కలర్ డాప్లర్ యంత్రాలకు నిధులు మంజూరు చేశామని, 50 పశువైద్య శిబిరాలకు కూడా నిధులు ఇచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన ఫర్నిచర్, ఉపాధిహామీ ద్వారా పశువుల కొట్టాల మంజూరు తక్షణమే చేపడతామని అన్నారు. సమాజంలో 98.7 శాతం ప్రజలు పాలు, మాంసం, గుడ్లు వంటి పశు ఉత్పత్తులపై ఆధారపడుతున్నందున పశువైద్యం మరింత బలంగా ఉండాలని, ఇకపై ఆకస్మిక తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక అధికారి డా. బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్లు డా. వెంకన్న, డా. పి. పెంటయ్య, డా. సత్యనారాయణ, డా. బి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా ఆరోగ్య సేవలపై కలెక్టర్ దృష్టి – ప్రత్యేక వైద్య శిబిరాల తనిఖీ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను గురువారం పరిశీలించిన కలెక్టర్, సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు, డేటా ఎంట్రీ విధానాలను పరిశీలించి రోగులకు ఇబ్బందులు కలగకుండా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచాలని, ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం సర్జికల్, స్త్రీ, పురుషుల ఓపీలు, ఫార్మసీ యూనిట్, స్టోర్స్, క్రిటికల్ కేర్ విభాగాలను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తరువాత మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మార్క్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి సేవలపై సమీక్షించారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, డాక్టర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు నెలలో పూర్తి చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 27, ప్రతినిధి: సూర్యాపేట పట్టణంలోని కేసారం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను నెల రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లకు కనెక్షన్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి నిరంతర నీటి సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. పట్టణ ప్రజల కోసం నిర్మించిన ఈ ఇళ్లలో అన్ని మౌలిక వసతులు సమయానికి అందుబాటులోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, గుత్తేదారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం కీలకం – కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరించి అర్హులైన ప్రతి పౌరుని పేరు తప్పకుండా నమోదు కావడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సిద్ధం కావడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకమని తెలిపి, ఈ నెల 30లోగా బీఎల్ఏలను నియమించి వారి జాబితాను నియోజకవర్గాల వారీగా సమర్పించాలని సూచించారు. అనంతరం బీఎల్ఏలు, బీఎలోలతో సంయుక్త సమావేశం నిర్వహించి ఎస్.ఐ.ఆర్ విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సాఫీగా నిర్వహించేందుకు అన్ని పార్టీలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగపు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిపిఎం ధర్నా





సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 27, ప్రతినిధి: చింతకాని మండలంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, రైతులకు మద్దతు ధర ప్రకటించాలని, ఎటువంటి షరతులు లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో బాబ్జి ప్రసాద్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో పై అధికారులకు సమాచారం అందించి త్వరలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సీనియర్ నాయకులు వత్సవాయి రాములు, మద్దిని బసవయ్య, రౌతు అప్పారావు, మడుపల్లి కిరణ్, తోటకూరి వెంకట నరసయ్య, బల్లి వీరయ్య, మాదిలేని రవి, గడ్డం కోటేశ్వరరావు, దేశబైన ఉపేందర్, నక్కన బోయిన శాంతారావు, మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా వికలాంగుల సదన్‌లో సేవా కార్యక్రమం



సందేశం టైమ్స్, ముదిగొండ, మార్చి 27, ప్రతినిధి: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన అమరబోయిన వీరబాబు-రేణుక దంపతుల కుమారులు ఆక్షేయకుమార్, కార్తికేయల పుట్టినరోజు సందర్భంగా గాయత్రీ మానసిక వికలాంగుల సదన్‌లో పిల్లల మధ్య కేక్ కట్ చేసి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆనందంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ శ్రీవిద్య పాల్గొని పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి ఆక్షేయకుమార్, కార్తికేయలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలకు భోజనాలు అందజేసి, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సదన్ నిర్వాహకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం: ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక

సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 27, ప్రతినిధి: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల (అటానమస్) ముందు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో విశ్వవిద్యాలయాలు ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లాకు మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదని గుర్తుచేశారు. దశాబ్దాలుగా విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తున్నప్పటికీ ఖమ్మంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో సుమారు 90 వేల మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ యూనివర్సిటీ లేకపోవడం అన్యాయమని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగులమేరా, జిల్లా నాయకులు గోపి, సుభాని, పవన్, నవీన్, సౌమ్య, ప్రవలిక, మేఘన, సమత, మమత, సానియా, సాయి, నికిత, కళ్యాణి, కావేరి తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని పీహెచ్‌సీలో ఎన్‌సీడీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 27, ప్రతినిధి: చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు ఎన్‌సీడీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణాదేవి మేడం ముఖ్య అతిథిగా హాజరై, డాక్టర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో ఫీల్డ్ సిబ్బంది, సూపర్వైజర్లు, పీడీఎంఓలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, లక్ష్యాలను సమయానికి చేరుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఎన్‌సీడీ సూపర్వైజర్ సత్యనారాయణ, మురళీ, వీరేందర్, కృష్ణారావు, రేచల్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాధపురంలో గ్రామసభ నిర్వహణ అభివృద్ధి అంశాలపై చర్చ





సందేశం టైమ్స్, జగన్నాధపురం, మార్చి 27, ప్రతినిధి: మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో సర్పంచ్ తాళ్లూరి స్వప్న అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై చర్చించారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, నూతనంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం, గ్రామంలో విద్యుత్ దీపాలు మరియు స్తంభాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం వంటి అంశాలపై విశ్లేషణ జరిపారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ సెక్రెటరీ, గ్రామ పెద్దలు, ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం – 'అరైవ్ అలైవ్'తో ప్రమాదాల నియంత్రణకు చర్యలు

సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 27, ప్రతినిధి: రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలను నియంత్రించగలమని చింతకాని ఎస్సై వీరేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, రోడ్డు ప్రమాదాల వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' మూడోవ విడత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం చింతకాని మండలంలోని కోదుమూరు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే ఎక్కువ శాతం మానవ నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో నిర్లక్ష్యం వంటి అంశాలే ప్రధాన కారణాలని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చేందుకు శిక్షలతో పాటు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు మరియు ప్రమాద ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.



# సందేశం టైమ్స్ క్యాలెండర్ ఘనంగా ఆవిష్కరణ

సందేశం టైమ్స్, పటాన్చెరువు మండల్, మార్చి 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం ఇంద్రేశం మున్సిపాలిటీ ఐనోల్ గ్రామంలో సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను మూడవ వార్డు కౌన్సిలర్ మందుమూల హర్షరెడ్డి మరియు 16వ వార్డు కౌన్సిలర్ జంగయ్య చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ టీ. సంగమేశ్వర్, సంగారెడ్డి టౌన్ బి. సంగమేశ్వర్ మరియు పటాన్చెరువు మండల్ రిపోర్టర్ బి. డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిపోర్టర్లు: సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ టీ. సంగమేశ్వర్, సంగారెడ్డి టౌన్ బి. సంగమేశ్వర్, పటాన్చెరువు మండల్ రిపోర్టర్ బి. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలి పటాన్చెరు



శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి: పటాన్చెరు మార్చ్ 27 (సందేశం టైమ్స్ బి డేవిడ్) బొల్లారం: గురువారం అమీన్పూర్ సర్కిల్ బొల్లారం డివిజన్ పరిధిలో ఐటిసి పరిశ్రమ సౌజన్యంతో పాఠశాలకు కంప్యూటర్లు బల్లి పారిశుద్ధ్యం కోసం ఆటోల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లారం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలలకు 15 కంప్యూటర్లు రెండు ప్రింటర్లు బొల్లారం మున్సిపల్ విభాగానికి 8 చెత్త సేకరణ ఆటోలు దివ్యాంగుల కోసం మూడు త్రిచక్ర సైకిళ్లను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటిసి కంపెనీ తన సామాజిక బాధ్యతలు భాగంగా పాఠశాలల అభివృద్ధికి బొల్లారం డివిజన్ పరిధిలో పారిశుధ్యం పెంపొందించేందుకు సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన నిఖిల్ డే బృందం – ప్రజా వాణి విస్తరణపై చర్చలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి విస్తరించేందుకు సమావేశంలో సమాలోచనలు జరిపారు. దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన సూచన పోర్టల్ తరహాలో తెలంగాణలోనూ 'ప్రజా సూచన పోర్టల్' ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల వివరాలను ఒకే వేదికలో అందుబాటులో ఉంచే విధంగా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని ఐటీ శాఖకు ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను నిఖిల్ డే ప్రశంసిస్తూ, ఇది దేశంలోనే చారిత్రాత్మక చట్టంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు దాన కిషోర్, వి. శేషాద్రి, బి. అజిత్ రెడ్డి, మాణిక్ రాజ్, దివ్య దేవరాజన్, వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





## జిల్లాలో ఇంధన కొరత లేదు – వదంతులను నమ్మవద్దు: అడిషనల్ కలెక్టర్ మాధురి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని అడిషనల్ కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఇంధన నిల్వలపై సమీక్షించి, జిల్లాలో నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పెట్రోల్ బంకులు మరియు గ్యాస్ ఏజెన్సీలకు సరఫరాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల పెట్రోల్ బంక్‌ల వద్ద కనిపిస్తున్న క్యూలను చూసి కొరత ఉందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ప్రజలు వదంతులను నమ్మవద్దని సూచించారు. అవసరం లేకుండా ముందస్తుగా నిల్వ చేసుకోవడం వల్ల డిమాండ్ ఒక్కసారిగా పెరుగుతోందని పేర్కొన్నారు. సాధారణంగా రోజుకు సుమారు 10 వేల ఎల్‌పీజీ సిలిండర్ల బుకింగ్స్ ఉండగా, వదంతుల ప్రభావంతో అది 16 వేల వరకు పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్‌ను కంటైనర్లు, డబ్బాలలో తీసుకెళ్లడం చట్టవ్యతిరేకమే కాకుండా ప్రమాదకరమని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు, డీలర్ల కార్యకలాపాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లై అంబదాస్, ఏఎస్‌వో రాజేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి వరకు మెట్రో రైలు విస్తరణకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: రాష్ట్ర అసెంబ్లీలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి గతంలో మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగిస్తామని చేసిన ప్రకటనను గుర్తుచేస్తూ, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు మెట్రో సేవలను విస్తరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఉండటంతో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడ నివసిస్తూ హైదరాబాద్‌కు రోజువారీ రాకపోకలు చేస్తున్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొని, మెట్రో రైలు విస్తరణ ప్రజలకు గొప్ప ప్రయోజనం కలిగిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా, మదీనాగూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని, 2026 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్ ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తావించారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు.

## గ్రామసభల నిర్వహణకు సిద్ధం కావాలి – తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు తీసుకోండి: కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, డిప్యూటీ జెడ్పీ సీఈఓ స్వప్న, ఇరిగేషన్ ఈఈ జై భీమ్‌లతో కలిసి ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామసభల ఏర్పాట్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. గ్రామసభలను ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని, లబ్ధిదారుల ఎంపిక వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో ముందస్తు చర్యలు చేపట్టి ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వాటర్ ట్యాంకర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని తెలిపారు. నీటి నాణ్యతను నిరంతరం పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ప్రతి హ్యాబిటేషన్‌కు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు, పంప్‌సెట్ లోపాలను 24 గంటల్లో సరిచేయాలని, హ్యాండ్ పంపులు, చిన్న రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లీచింగ్ పౌడర్ నిల్వ ఉంచి నీటి శుద్ధి చేయాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీల్లో ట్యాంకుల శుభ్రత నిర్వహించాలని సూచించారు. నేషనల్ హైవే పనుల వల్ల పైపులు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1916 గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, మండలపరిషత్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ రెడ్డి ఆధ్వర్యంలో ‘సందేశం టైమ్స్’ క్యాలెండర్ ఆవిష్కరణ – పలువురు నాయకుల హాజరు





సందేశం టైమ్స్, పటాన్చెరు, మార్చి 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలంలో ‘సందేశం టైమ్స్’ క్యాలెండర్‌ను బీఆర్‌ఎస్ పార్టీ పటాన్చెరు నియోజకవర్గం ఇంచార్జ్ ఆదర్శ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపియూఎస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి, మైనార్టీ సభ్యుడు అబ్బాస్ పాల్గొని విజయవంతం చేశారు. పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, “సందేశం టైమ్స్ మీడియా సంస్థ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది” అని అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ టి సంగమేశ్వర్, సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్ తదితరులు కూడా హాజరయ్యారు.




## యువత విద్యతో పాటు సామాజిక సేవ లక్ష్యంగా ఉండాలి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: యువత విద్యతో పాటు సామాజిక సేవను కూడా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని నిపుణులు సూచించారు. తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు 2, 4 ఆధ్వర్యంలో కల్పకూర్, అంగడిపేట గ్రామాల్లో, అలాగే ఎన్ఎస్ఎస్ 3 ఆధ్వర్యంలో మల్కాపూర్‌లో నిర్వహిస్తున్న శీతాకాల శిబిరాల రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్, కళాశాల క్యారియర్ గైడెన్స్ సెల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న ఫౌండేషన్ అధికారి కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అజీమ్ ప్రేమ్జీ విశ్వవిద్యాలయంలో ఏడు కోర్సుల్లో ఉచిత విద్యతో పాటు హాస్టల్ సదుపాయం అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మల్కాపూర్‌లో బాలికల శిబిరంలో హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాంబశివుడు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సిహెచ్ జోష్న, క్యారియర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ కరుణ, అధ్యాపకులు మిథున్ కుమార్ రాథోడ్, టీఎస్‌కేసీ మెంటర్ రమణారావు, యాదగిరి, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



## సిర్గాపూర్ మండలంలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం – నాణ్యతపై దృష్టి పెట్టాలని పట్లోల చంద్రశేఖర్ రెడ్డి సూచన

సందేశం టైమ్స్ నారాయణఖేడ్, మార్చి 27ప్రతినిధి సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గం లో సిర్గాపూర్ మండలంలోని వాసర్ మరియు చందర్తాండ గ్రామాల్లో సీసీ రోడ్ల పనుల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి హాజరై పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్‌లు హన్మంత్ రావు పాటిల్, రుక్మిణి పూల్ సింగ్ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రోడ్ల నిర్మాణం నాణ్యతతో జరగాలని, గ్రామాలు మరియు తండాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్ విఠల్ రెడ్డి, అంతు పటేల్, విట్టల్ రావు పాటిల్, మాజీ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎసప్ప, అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ, తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 27, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారంలో నూతనంగా నిర్మించిన 42 అడుగుల పంచముఖి హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, విగ్రహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు కూడా పాల్గొన్నారు.

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధుల సమీకరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 27, ప్రతినిధి: ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు రాష్ట్రంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధులను సమీకరించి సమర్థవంతంగా వినియోగించడానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున ప్రతి ఏడాది అభినందించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.ఈ సందర్భంగా శాసనమండలి సమావేశ హాలులో ముఖ్యమంత్రి గారు CSR నిధులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు CSR నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, CSR ద్వారా చేపట్టవచ్చిన ప్రాజెక్టుల సమన్వయ బాధ్యతను రాష్ట్ర స్థాయి సెల్ నిర్వర్తిస్తుందని తెలిపారు.తద్వారా, కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించి తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకొని నిధులను వినియోగించగలిగేలా తెలంగాణ CSR పోర్టల్ రూపొందించాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి గారు జాతీయ స్థాయిలో CSR నిధుల వాటా తెలంగాణలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని, ఇప్పటి వరకు వచ్చే ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, రాష్ట్రంలోని కంపెనీలు, పరిశ్రమలు తమ CSR ఖర్చును తెలంగాణలో ఎక్కువగా పెట్టేలా చూడాలని, ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి కొత్త పాలసీ రూపకల్పన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.